

డాక్టర్‌గారి భార్య

– కొమ్మూరి వేణుగోపాలరావు

(గత సంచిక తరువాయి)

ఇన్వెస్టిగేషన్లన్నీ పూర్తయినాయి. అదృష్టవశాత్తూ బ్రెయిన్‌లో హెమరేజ్ ఏమీలేదు.

సాయంత్రానికి తెలివొచ్చింది.

మరో రెండు రోజులకి చాలా వరకూ స్వస్థత చేకూరింది.

అతని డిశ్చార్జ్ చేశారు.

మళ్ళీ కోర్టు వాయిదా వస్తోంది.

ఈ సంఘటన జరిగాక అతనికి వ్యతిరేకంగా తీర్పు చెప్పే నైతిక శక్తి తగ్గిపోయింది. అనుకూలంగా తీర్పు చెప్పి యీ లోకం చేసే విమర్శలు భరించలేడు. ఆయన జీవితం ఓ విషమ పరీక్షలా తయారయింది.

రెండు రోజులు మధనపడి చివరకు ఓ నిర్ణయానికి వచ్చాడు.

ప్రొద్దుటే కాఫీ త్రాగుతూ పేపరు చూస్తున్న నరేష్ "అరె" అన్నాడు.

"ఏమిటి?" అనడిగింది సహజ.

"మన మేజిస్ట్రేట్‌గారు రిజిగ్నేషన్ సమర్పించారు."

"ఎందుకని?"

"ఎందుకనో చదువు."

ఆమె చదివింది. ఆయన మానసిక సంఘర్షణ, పడిన వేదన ఆమెకు అర్థమయింది.

"పాపం" అన్నది నిట్టూర్చి.

నరేష్ కూడా చాలా బాధపడ్డాడు. "నో! ఇలా జరగటానికి వీల్లేదు. వెళ్ళి రిజిగ్నేషన్ ఉపసంహరించుకోమని చెబుతాను" అని లేచి గబగబ బట్టలు వేసుకున్నాడు.

"పదండి. నేనూ వస్తాను" అని బాబుని జాగ్రత్తగా చూస్తూండమని చెప్పి సహజ కూడా వున్నది వున్నట్లు బయల్దేరింది.

మేజిస్ట్రేట్‌గారు ఇంట్లోనే వున్నారు. ఆ రోజు యాక్సిడెంట్ అయిన కుర్రాడు హుషారుగా ఇంట్లో అటూ ఇటూ తిరుగుతూ కనిపించాడు.

"రండి" అని ఆయన సాదరంగా లోపలకు ఆహ్వానించాడు. ఆయన భార్య కూడా లోపల్నుండి వచ్చింది.

"ఇలా చెయ్యటం మాకు చాలా బాధ కలిగించింది" అన్నాడు నరేష్.

"కాని నాకు సంతోషంగా ఉంది."

"కాని మీవంటి సమర్ధులైన న్యాయమూర్తులు దేశానికి అవసరం. ఇంత గుండె బలం కలవారు యీ విధంగా బలహీనమై పోవటం ఏ మాత్రం మంచిదికాదు."

"నా దృష్టికి మంచిదని తోచింది నేను చేశాను."

"నో ప్లీజ్! మీ నిర్ణయం మార్చుకోండి. జీవితంలో కాని, మమ్మల్ని కదిపేసిన కేసుల్లోగాని ఎన్నో విషాదాలు భరించాము. కాని ఇది భరించలేము" అన్నది సహజ.

ఆయన నవ్వాడు. ఏమీ జవాబు చెప్పలేదు.

వాకిట్లో ఏదో రిక్షా ఆగింది తలలు త్రిప్పి చూసేసరికి నరేష్ మీద కేసు పెట్టిన వ్యక్తి రిక్షాదిగి లోపలకు వస్తున్నాడు.

అతని ముఖంలో దిగులు, బాధ, అసంతృప్తి ఆవరించి వున్నాయి.

మేజిస్ట్రేట్‌గారికి నమస్కారం చేసి, నరేష్‌ని చూసి, "సార్! మేజిస్ట్రేట్‌గారి వంక తిరిగి, "సార్ మీరు పార్టీలనెవర్నీ ఇళ్లకు రానివ్వరని తెలుసు. కాని పేపర్లో మీ రాజీనామా గురించి వార్త చదివి వుండబట్టలేక వచ్చేశాను సార్. మీరు రాజీనామా చెయ్యనక్కర్లేదు. మంచి మనసులున్న, కర్తవ్యమే జీవిత లక్ష్యంగా పెట్టుకున్న ఇద్దరు పవిత్రుల ముందు, నా ప్రవర్తనా, నా తొందరపాటూ, నా అల్పత్వం తెలుసుకుని కేసు ఉపసంహరించుకునేందుకు ఆనాడే నిర్ణయం తీసుకున్నాను. ప్లీడరుగారు ఊళ్ళో లేకపోవటం వల్ల దాఖలు చెయ్యటం ఆలశ్యమయింది. సార్! మీ రాజీనామా ఉపసంహరించుకోండి సార్. నా క్రిమినల్, సివిల్ కేసులు రెండూ రద్దు చేసుకుంటున్నాను. అవసరమైన కాగితాలు ఆనక కోర్టుకు వచ్చి దాఖలు చేస్తాను."

ఆ రాత్రి... తన భర్త నిస్సహాయస్థితిలో వుంటే నిర్దాక్షిణ్యంగా, క్రూరంగా, అహంకారంగా మాట్లాడిన మనిషి ఇతనేనా?

సహజకు కలిగింది ఆశ్చర్యం కాదు. ఒక అద్భుతాన్ని చూసిన అనుభూతి.

🦋🦋🦋

మేజిస్ట్రేట్‌గారబ్బాయికి రోడ్డుమీద యాక్సిడెంట్ అయిన రోజున ఆ గలభాకి గోవర్ధనరావుగారికి గుండెలవిసిపోయాయి.

పావుగంటకొసారి చొప్పున తనకు సీరియస్‌గా వుందనీ, అర్జంటుగా రమ్మనీ ఫోన్ల మీద ఫోన్లు చేశాడు. ఈ కేసు గొడవలో ఉండబట్టి వెళ్ళటానికి నరేష్‌కు సాయంత్రందాకా వీలు చిక్కలేదు. సాయంత్రానికి ఎలాగో వీలుచేసుకుని వెళ్ళాడు.

ఆయన మంచమ్మీద మెడవరకూ దుప్పటి కప్పుకుని పడుకుని ఉన్నాడు.

"డాక్టరుగారూ! నా మీద దయలేదు. ప్రొద్దుట్నుంచీ ఎన్నిసార్లు చచ్చిపోయానో మీకు తెలీదు" అన్నాడు దీనంగా.

"సారీ! ఎంత ప్రయత్నించినా రాలేకపోయాను" అన్నాడు నరేష్.

"డాక్టరుగారూ! మీ మీద నాకు చాలా గురి. మీరు వచ్చి చూస్తేనాగని నాకు తృప్తిలేదు. ప్రొద్దుట్నుంచీ మీ కోసం కలవరిస్తున్నాను. బయట ఏదో యాక్సిడెంట్ జరిగింది. అప్పట్నుంచీ నా గుండె ఆగిపోతోంది."

ఆయన్ని జాగ్రత్తగా చెకప్ చేశాడు .బి.పి బాగా పెరిగింది.

"ఎంత వుంది?" అనడిగాడాయన.

నరేష్ నిజం చెప్పలేదు. ఎక్కువలేదని చెప్పి అతని తృప్తికోసం ప్లాసిబో ఇంజక్షన్ చేసి, బి.పి తగ్గటానికి టాబ్లెట్లు, గాభరా తగ్గటానికి ట్రాన్‌క్విలైజర్ ఇచ్చి ధైర్యం చెప్పి వచ్చేశాడు.

పదిహేను రోజులు గడిచి వుంటాయి.

ఒ.పిలో నంబరు ప్రకారం ఒక్కొక్కరూ లోపలకు వస్తున్నారు.

ఉదయం పదకొండు దాటివుంటుంది.

ఆ వరసలో "నమస్కారం డాక్టరుగారూ" అంటూ లోపలకి వచ్చిన వ్యక్తిని చూసి నిర్ఘాంతపోయాడు నరేష్.

ఆయన గోవర్ధనరావుగారు.

"మీరా?" అన్నాడు ఆశ్చర్యంగా.

మల్లెపువ్వులాంటి పంచా, లాల్చీ వేసుకున్నాడు. నీట్‌గా షేవ్ చేసుకున్నాడు. ఆయన ముఖం చిరునవ్వుతో వెలుగుతోంది.

"ఎందుకంత ఆశ్చర్యపడుతున్నారు?" అనడిగాడు చిరునవ్వుతో.

"బయటికొస్తే ఏదో జరుగుతుందన్న మీ భయం ఏమయిపోయింది?"

"ఎందుకో తెలీదు డాక్టరుగారూ, ఈవేళ ప్రొద్దుట అయిదున్నరకే మెలకువ వచ్చింది. లేచి ఇంటిముందు ఆరుబయట స్థలంలోకి వచ్చేసరికి దూరంగా కనిపించే పర్వతశ్రేణుల మీదుగా ఉదయిస్తున్న సూర్యబింబం కనిపించింది. ఓ గోళంలా, ఓ దివ్యలోకంలా, కనిపించే దైవంలా పైకి ఎగొస్తున్న ఆ సుందరదృశ్యాన్ని – సూర్యకిరణాలు నా ముఖం మీద పడి చురుక్కుమనిపించే వరకూ చూస్తూ నిలబడ్డాను.

"ఎందుకో ఇన్ని సంవత్సరాల నిర్వికారం నా నుండి తొలిగిపోయినట్లయింది.

ఏదో కొత్త వెలుగు.

కొత్త ధైర్యం.

కొత్త ఉత్సాహం.

"హాయిగా స్నానం చేశాను. ఇంట్లో అటూ ఇటూ తిరిగాను. చాలా ఆరోగ్యంగా అనిపించింది. మీ దగ్గరకు రావాలనిపించింది. బయటకు వచ్చాను. రోడ్డుమీదకు వచ్చాను. రోడ్డుమీద సైకిళ్ళూ, రిక్షాలూ పోతున్నాయి. నన్నేం చెయ్యలేదు చాలా దగ్గర్నుంచి ఓ సిటీబస్ దూసుకు వెళ్ళింది. నాకేం భయమనిపించలేదు. హాయిగా రోడ్డుదాటి మీ దగ్గరకు వచ్చేసాను."

"గుడ్" అన్నాడు నరేష్. ఆయన్ని టేబుల్‌మీద పడుకోబెట్టి ఎగ్జామిన్ చేశారు. బి.పి చూశాడు. నార్మల్‌గా వుంది.

అదే చెప్పాడు.

"నాకు తెలుసు – నార్మల్‌గా ఉంటుందని. అంతేకాదు డాక్టరుగారూ! రోజూ నేను చావంటే భయపడేవాడిని. ఇవేళ నాకు ఉన్నట్టుండి భయంపోయింది. నాకు చావు ఇప్పుడప్పుడే రాదు. వచ్చినా కేర్ చెయ్యను."

నిజంగా ఇది కలా నిజమా అన్నంత ఆశ్చర్యంగా వుంది నరేష్‌కు.

"డాక్టరుగారూ! మీరు నమ్మరు. పదిహేను ఇరవై ఏళ్ళ క్రితం వరకూ ఎంత మండుటెండలోనైనా సరే –మధ్యాహ్నం ఒంటిగంటా రెండుగంటల సమయంలో సైకిలు తొక్కుకుంటూ బయటికి వెళ్ళేవాడిని. అవతల సెంటర్‌లో భారత్‌కేఫ్ అని చిన్న హోటలుండేది. ఇప్పుడుందో లేదో తెలీదు. అక్కడికెళ్ళి సేమ్యాపాయసం 'ఈ రోజు స్పెషల్ సేమ్యా' అని లాక్ బోర్డ్ మీద రాసిపెట్టేవాడు – నాకెంతో ఇష్టమైన స్వీటు. మధ్యాహ్నం వేళ వెళ్ళి ఆ సేమ్యా పాయసం తినివస్తేనేగాని తోచేది కాదు .. సార్! ఆ సెంటర్‌లోకి వెళ్ళి సేమ్యా తిని రమ్మంటారా?"

నరేష్ ఆయన ముఖంలోకి చూశాడు. బలీయమైన కోరిక ఆ కళ్ళలో. ఇంట్లో చేయించుకుని తినవచ్చు. కాని అలా చేస్తే తృప్తి వుండదు. సెంటర్‌కి వెళ్ళి, హోటల్లో కూర్చుని, గాజుగ్లాసులోనో, కప్పులోనో ఓ స్పూన్ వేసి ఇస్తే – నలుగురి మధ్యా కూర్చుని తింటేనేగాని ఆ కోరిక తీరదు.

"తప్పకుండా వెళ్ళిరండి" అన్నాడు.

గోవర్ధనగారు నమస్కారం చేసి బయటకు వెళ్ళిపోయాడు.

ఇంచుమించు రెండు గంటలవేళ – హాస్పటల్ వర్క్ పూర్తి అవుతున్న ఆఖరి నిమిషాలలో ఆయన మళ్ళీ వచ్చాడు.

"ఏమండీ! ఏమిటి?" అనడిగాడు ఆప్యాయంగా.

"సెంటర్‌లో భారత్‌కేఫ్ లేదండీ. అది వున్నచోట ఏవేవో షాపింగ్ కాంప్లెక్సుల్లా కనిపించాయి. కాని అవతల పెద్ద పెద్ద హోటల్సు మూడు నాలుగు కనిపించాయి. వాటిల్లోకి వెళ్ళి 'సేమ్యా వుందా' అని అడిగాను. అదో స్వీటా అన్నట్లు నా వంక చూసి 'ఇప్పటి రోజుల్లో చెయ్యటంలేదు సార్! డిమాండ్ లేదు. రసమలయి వుంది, మలయ్‌కాజా ఉంది' అని ఏవేవో

పేర్లు చెప్పాడు. సరే వద్దులే అని వచ్చేసి – అలా నాలుగు బజార్లూ హాయిగా తిరిగొచ్చేశాను. పోన్లెండి డాక్టరుగారూ! సేమ్యా తినకపోతే తినకపోయాను కాని ఈ రోజు నాకు తృప్తిగా ఉంది."

అలసటవల్ల ముఖమంతా స్వేదబిందువులు అలుముకుని వున్నా గొప్ప రిలీఫ్ కనబడుతోంది.

సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు.

ఆ రాత్రి...

పదకొండు కావస్తోంది.

ఒ.పి పూర్తిచేసుకుని ఇంటికెళ్ళేముందు ఇన్‌పేషెంట్సందర్నీ చూసుకునే అలవాటు ప్రకారం ఒక్కొక్క బెడ్ దగ్గరకూ వెడుతున్నాడు.

గోవర్ధనరావుగారబ్బాయి – పాతికేళ్ళుంటాయి హడావుడిగా పరిగెత్తుకుంటూ వచ్చాడు. మామూలుగా అతనెప్పుడోగాని డాక్టరుగారికి కనబడడు.

"ఏం జరిగింది?" అనడిగాడు నరేష్ అతని ఆతృత చూసి.

"నాన్నగారు మామూలుగా తొమ్మిది గంటలకే పడుకున్నారు. పడుకున్న కాసేపటికి మంచి నిద్రలో ఉన్నట్టు కనిపించారు. కాని సరిగ్గా ఇంతకు ముందే ఏదో గురకలా వినిపిస్తే వెళ్ళి చూశాము. మనిషి అదోలా కనిపించారు. పిలిస్తే పలకటం లేదు" అన్నాడు గాభరాగా.

మధ్యాహ్నమే ఎంతో ఆరోగ్యంగా ఉల్లాసంగా కనిపించాడే. నరేష్ గుండె కలుక్కుమంది. "పదండి" అంటూ హడావుడిగా బయల్దేరాడు.

నిద్రపోతున్నట్టు ప్రశాంతంగా పడుకుని వున్నాడు గోవర్ధనరావుగారు.

ఆ గుండెలో చలనం లేదు.

కన్నుల్లో కదలిక లేదు.

కేవలం ఒకటి రెండు నిమిషాల క్రితం అంతా అయిపోయింది.

సంవత్సరాల తరబడి ప్రతిరోజూ చావంటే భయపడుతూ, ప్రతి రోజూ చావును చవిచూస్తూ నిర్జీవంగా బ్రతికాడు. కాని ఒక్కరోజు చావంటే భయంలేకుండా సజీవంగా ధైర్యంగా బ్రతికాడు.

బహుశా కార్డియాక్ అరెస్ట్.

ఏ చావునుంచి తప్పించుకుందామని సంవత్సరాల తరబడి తపించాడో నిద్రపట్టక తారట్లాడాడో ఆ చావు నిశ్శబ్దంగా, మెత్తగా, అతనికి తెలియని దశలో, అతను నిర్భయంగా వున్న దశలో కాటేసేసింది.

తప్పించుకోలేనని తెలిసి తప్పించుకోవాలని అలసిపోయేదాకా దురాశపడి లొంగపోయాడు.

అతడికంట్లోంచి ఓ కన్నీటి చుక్కరాలి గోవర్ధనరావుగారి కంటిమీద పడింది.

"సారీ" అని బరువైన హృదయంతో వెనక్కి తిరిగాడు.

🦋🦋🦋

టేబుల్ మీద ఫోన్ మ్రోగింది.

రిసీవర్ అందుకుని "హలో" అన్నాడు.

"నేను..."

"గుర్తువచ్చారు."

అవతలినుండి నవ్వు వినబడింది. "ఎవర్నో చెప్పండి."

"హ్యాన్స్సన్..."

"చంపారు. నా పేరు అదా?"

"సారీ! గుర్తుకోసం."

"చాలా రోజులకు ఫోన్ చేశాను."

"అవును. కులాసాగా వున్నారా?"

"లేను."

"ఏం?"

"ఉండాలని లేదు కాబట్టి."

"కొంతమదికి అదొక మానసిక రుగ్మత కావచ్చు."

"నా విషయంలో కాదని ఆత్మ విశ్వాసముంది."

"ఎందుకనిరారు మీరు?"

"రావాలని లేదు."

"ఎందుకని?"

"నా సమస్య ఎవరూ ఛేదించలేరు కాబట్టి."

"డాక్టరుగా నేను ప్రయత్నిస్తాను."

"మీరు చాలా గొప్ప డాక్టరు. సంపాదనలో కాకపోవచ్చు, డిగ్రీలో కాకపోవచ్చు. కాని అవన్నీ వున్నవారు చాలామంది మీముందు దిగదుడుపే. కాని నా సమస్య మీకు లొంగదు."

"ఎందుకని?"

"లొంగదు కాబట్టి."

"పోనీలెండి. మీ.. ఎలా వుంది?"

"హ్యాన్‌సన్సా? పెరుగుతోంది. మచ్చలు పెరుగుతున్నాయి.”

అతనేం మాట్లాడలేదు. గుండె బరువెక్కినట్లయింది.

"మచ్చలు శరీరమంతా...పోనీ ముఖం మీదకు వ్యాపించటానికి ఎన్నాళ్ళు పడుతుంది?"

"సారీ! నాకు తెలియదు."

"తెలిసికూడా చెప్పటంలేదు."

ఆమె నవ్వింది "ఏమి చెప్పాలో ఏమి చెప్పకూడదో మీకు బాగా తెలుసు."

"మీరు జీవితాన్ని బాగుచేసుకోండి."

"కుదరదు."

ఆమె కంఠస్వరంలోని ధృఢత్వం అతనికర్థమైంది. అది బెదిరించే కంఠంకాదు చెయ్యదల్చుకున్నది చేసి తీరేవారికుండే కంఠం.

కొన్ని జీవితాల్లో విషాదాలుంటాయి. అవి ఎంత తొలగించుకుందామని ప్రయత్నించినా తొలగిపోవు.

అసలు – డాక్టరుకు అయే పరిచయాల్లో ఎక్కువ విషాద చరిత్రలే వుంటాయి. బయటి ప్రపంచానికి చెప్పలేని, చెప్పకూడని అనేక రహస్యాలు అతనిముందు ఒప్పుకుంటారు. బయటికి అన్యోన్యంగా కనిపించే భార్యాబర్తలు, వాళ్ళ అంతరంగ మధనాలు, విచిత్రభావాలు – అన్నీ విని ఆకళింపు చేసుకుంటూ, వీలయితే పరిష్కరిస్తూ, ఆ రహస్యాలను భద్రపరుస్తూ ముందుకు నడుస్తూ వుండాలి.

విన్నవే వినాలి చెప్పిన సలహాలే చెప్పాలి. తానుమాత్రం అడుగులు జాగ్రత్తగా వేస్తూ వుండాలి.

అదలా వుంచి..

తనచూట్టూ పరిభ్రమించే యీ అశాంతిజీవుల ఆక్రందనలు, నిస్సహాయ నిట్టూర్పులలోని దుఃఖం ఒక్కొసారి యిముడ్చుకుని ఆ బరువు భరించటం కష్టమవుతూ వుంటుంది. అయినా భరించాలి.

(కొనసాగింపు వచ్చే నెలలో)

COMMENTS